


# సంస్కారం - కాంతి పాతూరి, Dublin,CA

*వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన 16వ ఉగాది ఉత్తమ రచనల పోటీలో*

*– నా మొట్టమొదటి కథ విభాగంలో - బహుమతి పొందిన కథ*

సూపర్ సింగర్ ఫైనల్స్ చూస్తున్న శిరీష ఫోన్ రింగ్ అయిన శబ్దానికి టీ.విని మ్యూట్‌లో పెట్టి ప్రక్కనే వున్న ఫోన్ అందుకుంది.

"హలో అక్కా నువ్వా ఏమిటి ఈ టైంలో ఫోన్ చేశావు? "

"....."

"ఏమిటి? "

"పెద్దమ్మ పోయిందా! ఎప్పుడు ఎలా?"

"ఓ గంట క్రితం .ఉన్నట్టుండి పడిపోయిందట. హాస్పటల్‌కి తీసుకెళ్ళేలోపు పోయిందట. ప్రక్కింటి కవిత ఫోన్ చేసి చెప్పింది. వీలయితే నువ్వు వెంటనే బయలుదేరి రా!"

"ఇప్పుడంటే బస్‌లు పట్టుకోవటం కష్టం కదా! కార్తీక్‌కి చెప్పి రేపొద్దున్నే బయలుదేరి వస్తాను."

అక్క చెప్పిన వార్త విని నా మనసు మూగపోయింది. వారం క్రితం మాట్లాడినప్పుడు కూడా ఎంతో హుషారుగా మాట్లాడిన పెద్దమ్మ, ఇంక కనిపించదు అనుకుంటే మనసంతా వెలితిగా అనిపించింది. పెద్దమ్మతో నాకున్న అనుబంధం మనసుని పొగమంచులా చుట్టేసింది.

నిద్రపోతున్న కార్తీక్‌ని లేపి జరిగిన విషయం చెప్పాను. తన ఆఫీస్ బిజీ నాకు తెలుసు. అందుకే ఒక్కదాన్నే ఉదయం బస్‌కి బయలుదేరతాను అని కూడా చెప్పాను. కావలసిన సామాన్లు సర్దుకుని ప్రొద్దున్నే లేవాలనుకుంటూ పక్కమీదకి చేరాను. కానీ, చాలా సేపు నిద్రరాలేదు.

నా చిన్నప్పుడు స్కూల్లో చదువుకుంటున్నప్పుడు ఓ సారి టైఫాయిడ్ జ్వరం వచ్చింది. అమ్మ, అక్క పిల్లలని చూసుకోవటానికి వెళితే నాకోసం వచ్చి హాస్పటల్లో ఉండి ఎంతో ధైర్యాన్నిచ్చింది పెద్దమ్మ. అలాగే నా జీవితంలో ఎదురైన ప్రతి సంఘటన తనతో

చర్చించేదాన్ని. ఎలాంటి సమస్యనైనా ఇట్టే తీర్పు చెప్పగల మేధావి. అలాంటి పెద్దమ్మని, పెద్దనాన్నగారు పోయినప్పుడు ఓదార్చటం మా వల్లకాలేదు. ఆ దిగులునుండి ఆవిడని బయటకి తీసుకురావటం మాకు అతికష్టమైన పనిగా మారింది. దాదాపు అయిదు సంవత్సరాలు పట్టింది తను మామూలుగా మారటానికి.

ఈమధ్యనే నా దగ్గరకు వచ్చి ఓ నెలరోజులుండి పిల్లలతో చిన్న పిల్లలాగా కలిసిపోయి ఆడుకోవటం ఇంకా మరచిపోలేకపోతున్నాను.

ఆలోచనలతో ఎప్పుడు నిద్రపట్టిందో తెలియలేదు.

●●●

ప్రొద్దున్నే 'పేపర్' అన్న కేకకు మెలుకువ వచ్చింది. గబగబా పిల్లల్ని కార్తీక్‌కి అప్పగించి బస్ స్టాండ్‌కి ఆటోలో వెళ్ళాను. బయలుదేరడానికి సిద్దంగా ఉన్న బస్‌లో ఎక్కి సీటు చూసుకుని కూర్చున్నాక మరలా పెద్దమ్మ జ్ఞాపకాలు వెంటాడాయి.

తనకి పిల్లలు లేని లోటు మా మూలాన మర్చిపోయానన్న మాటలు పదే పదే గుర్తుకొస్తున్నాయి.

నా ఆలోచనలు పూర్తికాకుండానే బస్ గమ్యానికి చేరుకుంది.

దిగేసరికి చిన్నప్పుడు నన్నెత్తుకు పెంచిన సూరయ్య తాత నిలబడి ఉన్నాడు.

"అమ్మలూ" అన్న సూరయ్య తాత కంఠం దుఖంతో మూగబోయింది.

వడిలిపోయిన సూరయ్య తాత భుజం మీద నా చెయ్యి, తాత ప్రక్కకి ఒరిగిపోకుండా ఆపింది.

పెదనాన్నగారు పోయాక సూరయ్య తాతే పెద్దమ్మకి సహాయంగా ఉన్నాడు.

అమ్మా, నాన్నగారు అప్పుడప్పుడు వెళ్ళి చూసొస్తుండేవారు. ఫోన్‌లో మేము వారానికి రెండుసార్లు మాట్లాడుతుండేవాళ్ళం. మా పిల్లలు 'పెద్దమ్మమ్మా ' అని పిలుస్తుంటే విపరీతంగా ఆనందపడిపోయేది. నా ఆలోచనలకి ఆనకట్ట వేస్తూ సూరయ్య తాత 'అమ్ములూ.. డ్రైవర్ కారు తెచ్చి ప్రక్కన పెట్టాడు ఎక్కమ్మా'అన్నాడు.

కారు ఇంటికి చేరేసరికి అప్పటికే అక్కడికి చేరుకున్న అమ్మా, నాన్నగారు, అక్కా, బావగారు, అన్నయ్య, వదినా ఏర్పాట్లు చూస్తున్నారు.

నన్ను చూడగానే అమ్మ ఏడుపు ఎక్కువైంది.

"ఇద్దరము వేరే ఇంటినుండి వచ్చినా సొంత అక్కా చెల్లెళ్ళలాగా కలిసిపోయాము. కష్టాల్లో, సుఖాల్లో ఇద్దరమూ కలిసి తిరిగేవాళ్ళం. అలాంటి పెద్దమ్మ ఇవ్వాళ లేదంటే నమ్మలేకపోతున్నాను" అమ్మ గొంతు కొరబోతోంది.

నాన్నగారి దుఃఖానికి అంతు లేదు. మగవాళ్ళు అంతగా ఏడవటం ఎప్పుడూ చూడలేదు. అందులో నాన్నగారు చలించటం చూస్తే నాకే కొత్తగా అనిపించింది. ఆయన చిన్నతనంలోనే వాళ్ళ ఇంటికి వచ్చిన వదినంటే తల్లితో సమానం నాన్నగారికి. తల్లిలేని లోటు తెలియకుండా పెంచిందని ఆయన ఎప్పుడూ చెపుతుండేవారు.

ఇందరి అభిమానాన్ని సంపాదించుకున్న పెద్దమ్మ, గలగల మాట్లాడే పెద్దమ్మ అలా మౌనంగా పడుకుంటే, దుఃఖం ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడుస్తున్న నన్ను ఎవరో పక్కకి లాగి కూర్చోపెట్టారు.

"మిగతా కార్యక్రమాలు తొందరగా జరపండి" అని పెద్దవాళ్ళు తొందరపెడుతున్నారు.

పెద్దమ్మ వేపు వాళ్ళు కొంతమంది రావాలని, సాయంత్రం నాలుగు గంటలకి శ్మశానానికి తీసుకు వెళతామని, బావగారు వాళ్ళతో చెపుతున్నారు.

పెద్దమ్మ ప్రక్కనే కూర్చుని తనతో ఉన్న అనుబంధాన్ని మననం చేసుకుంటుంటే నెమ్మదిగా ప్రక్కన కూర్చున్నవాళ్ళ మాటలు వినిపించసాగాయి.

కాసేపు పెద్దమ్మ గురించి వాళ్ళేమి మాట్లాడుకుంటున్నారో వినాలనిపించింది నాకు. అందరూ పెద్దమ్మ మంచితనం, ఆవిడ చుట్టుప్రక్కలవాళ్ళకి చేసిన సహాయాల గురించి మాట్లాడుకుంటున్నారు.

ఎవరెవరో వచ్చి చూసి వెళుతున్నారు. కొంచెం జనప్రవాహం తగ్గాక మరలా నా ప్రక్కన కూర్చున్న వారి మాటలు ఎంత వద్దనుకున్నా నా చెవిన బడుతున్నాయి.

"శారదా పిల్లల్ని స్కూల్ కి పంపిచ్చొచ్చావా?"

"పంపే వచ్చాను వదినా! నువ్వు వంట చేసొచ్చావా?"

"లేదు శారదా! వెళ్ళాకా చెయ్యాలి."

"ఇదిగో రాధా నిన్నే ఇవాళా పనిమనిషి వచ్చిందా మీకు?"

"లేదక్కా! ఎందుకో మానేసింది రెండు రోజులనుండి"

"అవునా! దొంగది డబ్బులు మాత్రం అన్నిరోజులకి ఇవ్వాలి. తను మాత్రం నాగాలు పెడుతుంది"

"అన్నట్టు రాధా.. మీ అక్కగారబ్బాయి అమెరికా నుండి వచ్చాడట కదా!? ఏమి తెచ్చాడేమిటి? పెళ్ళి చేసుకుని వెళతాడా ఈసారైనా?"

"పిల్లలకేవో తెచ్చాడక్కా. సంబంధాలు చూస్తున్నాము. నిన్ననే అక్క ఫోన్ చేసి చెప్పింది ఇవ్వాళ రమ్మని. ఇదో మామ్మగారు పోయారు కదా ఓసారి చూసి వెళ్ళాక వెళదామని ఆగాను."

"శారదా రాత్రి మాకు కరెంటు పోయింది మొగలిరేకులు ఏమైంది? ఆర్.కే నాయుడు బతుకుతాడంటావా? మీనాక్షి ఇంతకీ బతికుందా లేదా? రాత్రంతా కరెంటు వాడిని తిట్టుకోవటం సరిపోయింది తెలుసా!"

ఇలా సాగుతున్న వాళ్ళ మాటలు విని నాకు మతిపోయింది. అది ఒకావిడ చనిపోయి పడుకున్న ప్రదేశమని వాళ్ళ తరపు బంధువులంతా దుఃఖంలో ఉన్నారని స్పృహ లేకుండా సాగుతున్న వారి సంభాషణ నాకు అసహ్యంకలిగింది.

నా ఉద్దేశం వాళ్ళు అలాంటి మాటలు మాటలాడకూడదని కాదు కానీ, సందర్భం అదికాదనిపించింది. వారికి ఏమీ తోచక పోతే, చూసి వెళ్ళిపోవాలి, కానీ ఇది సరైన పద్దతి కాదనిపించింది. వాళ్ళకి గట్టిగా అరిచి చెప్పాలనిపించింది "దయచేసి నిశ్శబ్దంగా ఉండండి" అని. ఈ విషయం అందరికి మామూలేనేమో. నాకు మాత్రం విచిత్రంగా చిరాకుగా అనిపించింది.

ఇంతలో పెద్దమ్మ తరపు వాళ్ళు వచ్చారని ఎవరో చెప్పేసరికి వీళ్ళ మాటలన్నీ ఆగిపోయాయి.

●●●

పెద్దమ్మకి జరగవలసిన కార్యక్రమాలన్ని పూర్తయ్యాక సూరయ్యతాతకి ఇల్లు అప్పగించేసి మేమందరం ఎక్కడివాళ్ళం అక్కడికి బయలుదేరాం.

కార్తీక్‌కి ఫోన్ చేసి పిల్లలు ఎలా వున్నారో కనుక్కుని రేపొద్దున బస్ స్టాండ్‌కి రమ్మని చెప్పి బస్ ఎక్కాను.

పెద్దమ్మ వెళ్ళిపోయిన జ్ఞాపకాల్లోంచి కొంచెం బయటపడినా, ఆరోజు పెద్దమ్మ శవం ప్రక్కన వాళ్ళు మాటలు అప్పుడప్పుడు గుర్తొచ్చి చిరాకుగా అనిపించింది.

ఎలా తెలియ చెప్పాలి ఇలాంటి సంస్కారం లేని వాళ్ళకి? ఎవరినీ పరామర్శించకపోయినా ఫరవాలేదు కానీ దయచేసి అసందర్భ సంభాషణలతో వాతావరణంలోని మూడ్‌ని పక్కదోవ పట్టించకండి అని ఎవరైనా గొంతెత్తి చెబితే బావుండుననిపించింది. కాని మనం అరిచినా ఎంత ప్రయోజనముంటుంది?

బహుశా సంస్కారం ఒకరు నేర్పితే రాదేమో.. ఎవరికి వారికి కలగాలేమో?

Click here to share your comments on this story